అనుదినం జనపక్షం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

1

సోమవారం 24 జులై 2023

దుండగులకు కఠినంగా శిక్షించాలి

- గిరిజన సంఘం నాయకులు డిమాండ్

నవతెలంగాణ-గాంధారి

మణిపూర్‌లో ఒక గిరిజన మహిళలపై లైంగికదాడికి పాల్పడిన దుండుగులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ప్రకాష్ నాయక్ డిమాండ్ చేశారు. గాంధారి మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మణిపూర్ రాష్ట్రంలో బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్ ఉందని వీరి హయాంలో ఎక్కువగా గిరిజనులపై లైంగికదాడుల ఘటనలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. వెంటనే అక్కడి రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లైంగికదాడికి పాల్పడిన నిందితులను ఉరితీయలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శీను నాయక్, ప్రకాష్ నాయక్ పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసు

నవతెలంగాణ-గాంధారి



సూచనలిస్తున్న ఎస్ఐ

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తప్పవని, మైనర్ బాలురకు వాహనాలు ఇచ్చినట్లయితే వాహన యజమానిపై, వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని ఎస్సై సుధాకర్ హెచ్చరించారు. ఆదివారం గాంధారి మార్కెట్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. మైనర్‌లు నడుపుతున్న వాహనాలను సీజ్ చేసి వారి కుటుంబీకులను పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్‌లకు వాహనాలు ఇచ్చిన వాహన యజమానులకు జరిమానా విధించారు.



మణిపూర్ ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మణిపూర్ ఘటనపై మోడీ మౌనం వీడాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు

నవతెలంగాణ-కంఠేశ్వర్

మణిపూర్ ఘటన దేశాన్ని కలిచి వేసినా, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మౌనంగా ఉండడం, మహిళల పట్ల బిజెపి ప్రభుత్వ వైఖరి అర్థమవుతుందని బిజెపి పాలిత ప్రాంతమైన మణిపూర్ లో మహిళలకు రక్షణ లేదని నేడు జరిగిన సంఘటనతో అర్థమవుతుందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు ఎద్దేవ చేశారు. నగరంలోని హమాల్‌వాడీలో ఆదివారం మణిపూర్ ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బాబు, సీఐటీయూ జిల్లా కన్వీనర్ నూర్జహాన్ మాట్లాడారు. సంఘటన జరిగి 75 రోజులు గడుస్తున్నా కనీసం ప్రధానమంత్రి ఘటనపై మాట్లాడకుండా ప్రతిపక్షాలు ఎంత మొరపెట్టుకున్నా మణిపూర్ అల్లర్లకు సంబంధం లేనట్టుగా దేశ ప్రధాని వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో మహిళల పట్ల దాడులు, లైంగికదాడులు, హత్యలు అత్యధికం అవుతున్నా, కనీసం రక్షణ కల్పించలేని కేంద్ర ప్రభుత్వం దేశంలో ఉండడం దురదృష్టకరమని, రానున్న కాలంలో మహిళల భద్రత పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరి నిర్లక్ష్యంగా ఉండబోతోందని అర్థమవుతుందని వారు తెలిపారు. వెంటనే మణిపూర్ ను రక్షించాలని, మహిళలను నగ్నంగా ఊరేగించిన వారిని వెంటనే కఠినంగా శిక్షించి మణిపూర్ అల్లర్లపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వారిస్ బిగ్, గల్లీ వాసులు గంగమ్మ, రాజక్క, విమలమ్మ, బిబి ఆశ, సుజాత, సరూప, సువర్ణ, లక్ష్మి, సుకన్య, అంబికా, రాధిక తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో ఆశాన 'ఘర్'

- ఆశాజ్యోతి పథకంలో ఇండ్లు నిర్మించి 40 ఏండ్లు
- వెట్టి చాకిరి విముక్తి, జోగిని వ్యవస్థ నిర్మూలన పథకంలో ఇండ్ల నిర్మాణం
- శిథిలావస్థకు చేరి ఊరుస్తున్న ఇండ్లు
- దిక్కులేక జీవిస్తున్న 100కు పైగా కుటుంబాలు
- గృహలక్ష్మి కోసం వేడుకోలు

నవతెలంగాణ-నవీపేట్

నవీపేట్ మండలంలోని ఆశ నగర్, ఆశాజ్యోతి కాలనీ వాసులు పెను ప్రమాదంలో జీవిస్తున్నారు. 1985వ సంవత్సరంలో వెట్టి చాకిరి విముక్తి, జోగిని వ్యవస్థ నిర్మూలనకై అప్పటి ప్రభుత్వాలు ఆ కుటుంబాలకు ఆవాసం కల్పించేందుకు కలెక్టర్ ఆశాజ్యోతి ఆధ్వర్యంలో వెట్టి చాకిరి విముక్తి కోసం బాండెడ్ లేబర్ లకై మండలంలోని ఆశ నగర్ లో సుమారు 100 కుటుంబాలు, ఆశాజ్యోతి కాలనీలో 52 కుటుంబాలతో పాటు 36 జోగిని కుటుంబాలకు ఇండ్లు నిర్మించి ఇచ్చారు. దీంతో అప్పటి కలెక్టర్ ఆశాజ్యోతి పేరుతోనే కాలనీకి నామకరణం చేశారు. ఇండ్లు నిర్మించి సుమారు 40 సంవత్సరాలు కావడంతో ఆశా నగర్‌లో ఇండ్లు శిథిలావస్థకు చేరాయి. 90 శాతం కుటుంబాలు ఇండ్లను ఖాళీ చేసి మరోచోట కిరాయి ఇండ్లలో నివసిస్తున్నారు. కాగా ఇంటి అద్దె చెల్లించలేని నిరుపేదలు, ఒంటరి మహిళలు వృద్ధులు ఆ ఇండ్లలోనే దశాబ్ద కాలంగా చిన్న చిన్న మరమ్మత్తులు చేసుకొని జీవిస్తున్నారు.

ముసురు వానతో పొంచివున్న ప్రమాదం

గత వారం రోజులుగా ముసురు వాన కురుస్తుండడంతో వర్షపు నీరు స్లాబు నుండి ఊరుస్తుండటంతో తాటిపత్రిలు కట్టి చిన్న చిన్న పిల్లలతో జీవిస్తున్నారు. స్లాబుతో పాటు గోడలకు తేమచేరి పెచ్చులు ఊడుతుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయం భయంతో కాలం వెళ్లదీస్తున్నామని రజియా వాపోతున్నారు. గత రెండు రోజుల క్రితం అర్ధరాత్రి ఆశా నగర్ లో ఇల్లు కూలడంతో త్రుటిలో ప్రాణాపాయం తప్పిందని నర్సయ్య భయాందోళన వ్యక్తం చేశారు. సరిగ్గా విద్యుత్ సౌకర్యం లేని ఇండ్లలో చిన్నపిల్లలు, వృద్ధులు ఒంటరి మహిళలు విష పురుగుల మధ్య అరచేతిలో ప్రాణం పట్టుకొని జీవిస్తున్నామని ప్రభుత్వం స్పందించి గృహలక్ష్మి ద్వారా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని అప్పటివరకు పునరావాసం కల్పించాలని కోరుతున్నారు.



వర్షానికి ఊరుస్తుండటంతో టార్పాలిన్ కవర్ కప్పివేత..



శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్న గోడను చూపుతున్న మహిళ

దిక్కు లేక తల దాచుకుంటున్నాం.. ముంతాజ్



నిరుపేదలమైన తమకు దిక్కు లేక ఖాళీగా ఉన్న ఆశ నగర్ ఇండ్లకు మరమ్మత్తులు చేసుకొని జీవిస్తున్నాం. గోడలు, స్లాబు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పేచ్చులూడి ప్రమాదకరంగా ఉంది. వర్షాలతో ఊరుతుండడంతో బకెట్ల సాయంతో నీటిని బయటకు తీస్తున్నాం.వేరే దిక్కు లేక అక్కడే జీవించాల్సి వస్తుంది.

దశాబ్దాలుగా ఇక్కడే జీవిస్తున్నాం

కర్రోల్లా రాములు



గత ప్రభుత్వం ఇచ్చిన ఇంట్లోనే దశాబ్దాలుగా జీవిస్తున్నాం. ఇండ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. చాలామంది లబ్ధిదారులు కిరాయి ఇండ్లు తీసుకొని బతుకుతున్నారు. ప్రభుత్వం శిథిలావస్థకు చేరిన ఇండ్లను కూల్చి చేసి అదే స్థానంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలి.

జీపీ కార్మికుల సమ్మెకు ఎస్ఎఫ్ఐ మద్దతు



జీపీ కార్మికులతో కలిసి నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-జుక్కల్

గ్రామపంచాయతీ సఫాయి కార్మికుల సమ్మెకు ఎస్ఎఫ్ఐ నాయకులు మద్దతు తెలిపారు. మండల కేంద్రంలో జీపీ కార్మికుల చేపట్టిన సమ్మె 18వ రోజుకు చేరగా.. ఆదివారం ఎస్ఎఫ్ఐ మండల శాఖ సంపూర్ణ మద్దతు తెలిపి సమ్మె శిబిరంలో కూర్చొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల శాఖ అధ్యక్షుడు షేక్ ఫిర్దోస్ మాట్లాడుతూ జీపీ కార్మికుల చేపట్టి 18 రోజులవుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవం దారుణమని అన్నారు. వీరి ఆందోళనలకు తమ మద్దతు ఉంటుందని తెలిపారు. జీపీ కార్మికులకు కనీస వేతనం అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటీయూ జిల్లా కమిటి సభ్యుడు సురేష్ గొండ, ఎస్ఎఫ్ఐ నియోజకవర్గ అధ్యక్షుడు సాగర్, జీపి కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గోవింద్, కార్యదర్శి గంగారాం , కార్మికులు వాగ్మారే విఠల్, వాగ్మారే మారుతీ, సాయులు, పండరి, జాఫర్, సుభాష్, సంగ్రాం గ్రామపంచాయతి కార్మీకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పెద్ద మల్లారెడ్డిలో రాష్ట్ర బృందం పర్యటన

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామానికి నేడు స్వచ్ఛ సంరక్షణ గ్రామీణ 2023 రాష్ట్ర పరిశీలన బృందం వస్తున్నట్లు మండల పంచాయతీ అధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆదివారం పెద్ద మల్లారెడ్డి గ్రామపంచాయతీలో పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మీ రాజలింగం, కార్యదర్శులు లక్ష్మీ, దయాకర్, తదితరులు ఉన్నారు.

సీఐగా పదోన్నతి పొందిన సాయికుమార్‌గౌడ్‌కు సన్మానం



సాయికుమార్‌గౌడ్‌కు సన్మాన కార్యక్రమం చేపట్టిన గ్రామస్తులు

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రానికి చెందిన సాయికుమార్ గౌడ్ నిజామాబాద్ 6వ టౌన్ లో ఎస్ఐగా విధులు నిర్వహించి సీఐగా పదోన్నతి పొందడంతో గ్రామస్తులు ఆదివారం ఆయనకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాక్లూర్ గ్రామం నుంచి ఒక్క వ్యక్తి ఉన్నత స్థానాలకు వెళ్లడం అభినందనీయమని అన్నారు. ఆయన సేవలతో గ్రామానికి మంచి పేరు వస్తుందని అన్నారు. అలాగే మరెన్నో ఉన్నత స్థానాలకు సాయికుమార్ గౌడ్ ఎదగాలని గ్రామానికి మంచి పేరు తీసుక రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై 28న జిల్లా సదస్సు



మాట్లాడుతున్న నాయకులు

- జయప్రదం చెయ్యండి : కార్మిక సంఘాల జేఏసీ నాయకుల పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 28న నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో జిల్లా సదస్సు నిర్వహించనున్నట్టు నాయకులు తెలిపారు. వివిధ రంగాల కార్మికులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం నిజామాబాద్ జిల్లాలో సీఐటీయూ కార్యాలయం వద్ద కార్మిక సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల జేఏసీ నాయకులు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు నూర్జహాన్, వై ఓమయ్య సుధాకర్‌తో పాటు ఐఎఫ్‌టియు జిల్లా సహాయ కార్యదర్శి శివ, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు వరదయ్య మాట్లాడారు. 'క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని కాపాడు కుందాం. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం. నరేంద్ర మోదీ నాయకత్వంలోని కార్పొరేట్ అనుకూల కేంద్ర బిజెపి ప్రభుత్వం బరితెగించి ప్రజా, కార్మిక వ్యతిరేక పరిపాలన సాగిస్తున్నది. జాతీయ సహజ వనరులు, ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా స్వదేశీ, విదేశీ కార్పోరేట్లకు అమ్మేస్తు న్నది. డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్, ఇతర నిత్యా వసర సరుకుల ధరలు పెంచి ప్రజల నడ్డివిరిచింది. 2023-24 కేంద్రం బడ్జెట్ లో వ్యవసాయ రంగానికి, ఆహార ఉత్పత్తులకు సబ్సిడీలకు భారీగా కోతలు విధించింది. జిడిపిలో విద్యా రంగానికి 6 శాతం, వైద్య రంగానికి 2 శాతం కేటాయించకుండా నిర్లక్ష్యం చేసింది. ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాలపై ఉక్కుపాదం మోపింది. అనేక త్యాగాలు, రక్త తర్పణతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్లు మారుస్తూ పార్లమెంట్లో చట్టం చేసింది. వేతనాల కోడ్ చట్టంతో కనీస వేతనాలు నిర్ణయించే మౌలిక విధానానికి మంగళం పాడింది. వీటితో పాటు అనేక రంగాల్లో కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నట్టు' తెలిపారు. కేంద్రం చర్యలను తిప్పికొట్టేందుకు ఐద్య ఉద్యమాలు చేపట్టేందుకు కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. నగరంలోని 28న చేపట్టే జిల్లా సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గోవర్ధన్, ఐఎఫ్టియు జిల్లా నాయకులు వెంకన్న ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు శివరాం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోడు భూముల పంపిణీలో అవకతవకలు సరి చేయాలి

- సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా డిమాండ్

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

పోడు భూముల పట్టాల పంపిణీలో అవకతవకలు సరి చేయాలని, గిరిజనేతర బీసీ పేదలకు, అర్హులందరికీ పట్టాలి ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి బాలరాజ్ సహాయ కార్యదర్శి ప్రకాష్ మాట్లాడుతూ అనేక పోరాటాలతో మొన్నటి బడ్జెట్ అసెంబ్లీ సమావేశంలో గిరిజన గిరిజనేతరులకు 11 లక్షల 50 వేల ఎకరాలకు అర్హులు ఉన్నారని వారికి పట్టాలిస్తామని భవిష్యత్తులో అడవిని నరకకుండా చూసుకుంటామని సీఎం హామీ ఇచ్చినట్టు గుర్తుచేశారు. కానీ ఇప్పుడు కేవలం గిరిజనులకు మాత్రమే అందులో 7,50,000 ఎకరాలకు అర్హులు ఉంటే కేవలం లక్ష చిల్లర ఎకరాలకు మాత్రమే పట్టాలు ఇవ్వడం అంటే మోచేతికి మోచేతికి బెల్లం పెట్టడమే అవుతుందని ఎద్దేవ చేశారు. సాగులో ఉన్న వారందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశాయి. అయితే ఇటీవల కాలంలో పట్టాలు పంపిణీ చేసిన వాటిల్లో సాగులో లేని వారికి వారి కుటుంబాల పేరుతో పట్టాలు చేయించుకొని వాస్తవ సాగుదారులకు అన్యాయం చేశారని ఈ సంఘటనలపై కూడా విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, నారాయణ, పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు జి సురేష్ పాల్గొన్నారు

కుంటలో పడి మహిళ మృతి

నవతెలంగాణ-గాంధారి



మృతిచెందిన పోచవ్వ

ప్రమాదవశాత్తు కుంటలో పడి మహిళ మృతి చెందిన ఘటన గాంధారి మండలంలోని చిన్నపోతంగల్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికిచెందిన గొల్ల.పోచవ్వ (45) తన ఇంటి నుంచి బయలుదేరి పొలంలో పనిచేయడానికి ఉదయం ఏడున్నర గంటలకు తన పొలానికి వెళ్లింది. ప్రమాదవశాత్తు పొలానికి ఆనుకొని ఉన్న కుంటలో పడి మృతి చెందింది. మృతురాలి భర్త గొల్ల సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గాంధారి ఎస్సై సుధాకర్ తెలిపారు. మృతురాలికి ముగ్గురు కుమారులు కాగా పెద్ద కుమారుడికి వివాహము అయినది.

కోళ్లను విదేశాలకు ఎగుమతి చేయాలి



కోళ్ల ఫాంను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి

- కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాల

నవతెలంగాణ-భిక్కనూర్

కోళ్లను ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి వ్యాపారులు ఎదగాలని కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాల తెలిపారు. ఆదివారం మండలంలోని భిక్కనూర్ పట్టణ శివారులో ఉన్నా కే జే యల్ కోళ్ల ఫ్యాక్టరీని ఆయన పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన కు కేజేఎల్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరాజు శాలువాలతో సత్కరించారు. అనంతరం కోళ్లను మంత్రి పరిశీలించి, కోళ్ల ఉత్పత్తికి తీసుకుంటున్న పలు చర్యలను మంత్రికి శ్రీనివాసరాజు వివరించారు. కోళ్ల దాన రేటు అధికంగా పెరగడం వల్ల కోళ్ల ఉత్పత్తి క్రమంగా తగ్గిపోతుందని తెలిపారు. కోళ్లకు అవసరమయ్యే దాణ మొక్కజొన్న, సోయా ద్వారా తయారు చేయడం జరుగుతుందని తెలిపారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ కోళ్ల పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి కేంద్ర ప్రభుత్వం పలు రాయితీలు కల్పిస్తుందని, కోళ్ల పరిశ్రమల ద్వారా పెద్ద ఎత్తున వ్యాపారాలు చేసి ఆర్థికంగా లాభాలు పొందాలని మంత్రి సూచించారు. కోళ్ల తయారీతో పాటు గుడ్లు తయారయ్యే పలు షెడ్లను మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ, భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ వెంకటరమణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు రమేష్ రెడ్డి, కేజేఎల్ సంస్థ సూపర్వైజర్లు శ్రీనివాస్ రెడ్డి, నాగర్తి రాంరెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

నవతెలంగాణ-తాడ్వాయి

తాడ్వాయి మండలం కృష్ణాజివాడి రైతు వేదిక దగ్గర్లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. బీహార్ రాష్ట్రానికి చెందిన సూర్య అనే యువకుడు బతుకుదేరువు కోసం కృష్ణాజివాడి గ్రామంలో ఓ రైతు వద్ద పాలేరుగా పనిచేస్తున్నారు. బ్రహ్మాజీ వాడి గ్రామ శివారులో ఎల్లారెడ్డి, కామారెడ్డి రోడ్డు పక్కన పశువులను మేపుతున్న సమయంలో కృష్ణాజివాడి గ్రామానికి చెందిన ఉగ్రవాయి దాసరి రాజు కు చెందిన ఆటో సూర్యను బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సూర్య పైనుంచి ఆటో వెళ్లడంతో సూర్య నడుము, రెండు కాళ్లు విరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. సూర్య ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్టు వారు వివరించారు. ప్రమాదం జరిగిన వెంటనే యువకుడిని చికిత్స నిమిత్తం స్థానికులు కామారెడ్డి ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్ఐ ఆంజనేయులు ను నవ తెలంగాణ వివరణ కోరగా ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

ఊపందుకున్న వరి నాట్లు

- కూలీలకు భలే డిమాండ్
- ఇతర మండలాల నుంచి వస్తున్న కూలీలు

నవతెలంగాణ-లింగంపేట్

గత వారం కురిసిన వర్షాలతో వరినాట్లు జోరందుకున్నాయి. దాంతో కూలీల కొరతతో వారికి డిమాండ్ ఏర్పడింది. వాస్తవానికి ఈసారి వర్షాలు ఆలస్యం కావడంతో వరిసాగుపై రైతులు ఆశలు వదులుకున్నారు. కొందరు రైతులు బావులు, బోర్ల నీటితో నారు మడి సాగు చేశారు. నారు ముదురు తోందని, మరో వారం దాటితే ఇక వరిసాగుపై ఆశలు వదులుకోవాల్సిందేనని రైతులు అనుకుం టున్న తరుణంలో నాలుగు రోజుల పాటు వరుసగా కురిసిన వర్షాలతో వరి నాట్లు జోరందుకున్నాయి.

కామారెడ్డి జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్లో 5,36,000 ఎకరాల్లో పంటలు సాగు అవుతాయని అధికారులు అంచనా వేశారు. ఇందులో ముఖ్యంగా రెండు లక్షల 86 వేల ఎకరాల్లో వరి పంట గత సంవత్సరం కంటే 10000 ఎకరాలు అదనంగా సాగు అవుతుందని అధికారుల అంచనా వేశారు. ఇప్పటికే రెండు లక్షల ఎకరాలపైగా వరి నాట్లు బోరు బావుల వద్ద వేశారు. ముందస్తుగా బాన్సువాడ నిజాంసాగర్ బీర్కూర్ నర్సూర్లబాద్ ప్రాంతాల్లో ఇప్పటికే వరి కలుపులు తీస్తున్నారు.



వారినాట్లు వేస్తున్న మహిళలు

ఇతర మండలాల నుండి కూలీలు

నాలుగు రోజులపాటు వర్షాలు కురవడంతో సాగుకు సిద్ధంగా ఉన్న చిన్న సన్న కారు రైతులు వరి నాట్లు వేయడంలో నిమగ్నమయ్యారు. దీంతో కూలీల కొరత తీవ్రంగా ఏర్పడింది. ఇతర మండలాల నుంచి ఆటోల ద్వారా కూలీలను తీసుకొస్తూ నాట్లు వేయిస్తున్నారు. ఎకరాకు 6000 రూపాయలు చొప్పున గుత్తా మాట్లాడుకుని ఏడుగురు కూలీలు బృందంగా వారినాట్లు వేస్తున్నారు. దీంతో ఒక కూలికి 750 రూపాయల చొప్పున పడుతుంది.

డీసీసీబీ చైర్మన్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో బిఆర్ఎస్ పార్టీ నాయకుల , ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా డిసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు ఆప్యాయంగా పంచి పెట్టారు. అనంతరం ఏ ఎస్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలోని పేషెంట్లకు పండ్లు పంపిణీ చేశారు. పలువురు మాట్లాడుతూ భాస్కర్ రెడ్డి యువతరానికి ఐకాన్ అని ప్రజల కోసం నిరంతరం ఆలోచించే వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు , ఏ ఎస్ ఆర్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు గోస్కి సాయి ప్రసాద్ , మండల అధ్యక్షులు బాలయ్య , నారాయణ , ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ , బిచ్కుంద మండల అధ్యక్షులు రోటే సాయిలు , పెద్ద కొడంగల్ అధ్యక్షులు మేత్రి సాయిలు సభ్యులు పాల్గొన్నారు.

అదనపు గదుల నిర్మాణానికి లక్ష విరాళం

• పూర్వ విద్యార్థి చేయూత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



మండలంలోని హైస్కూల్లో అదనపు గదుల నిర్మాణంకోసం స్కూల్ డెవలప్మెంట్ కమిటీకి గ్రామానికి చెందిన కుమ్మరి శ్రీను (దుబాయ్) ఆదివారం లక్ష రూపాయలు విరళంగా అందించారు. వారి కుటుంబం సభ్యులు స్కూల్ డెవలప్మెంట్ కమిటీకి లక్ష రూపాయల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు గ్రామ సర్పంచ్ చంద్రకళ బాలకిషన్ ఫైపుల రాజిరెడ్డి ఎంపిటిసి లు రూపాల గంగారెడ్డి, తలారి మరి సతీష్, మాజీ సర్పంచ్ నర్సారెడ్డి , బైరి కిరణ్ తదితరులు ఉన్నారు.

కూలిన ఇంటిని పరిశీలించిన మోహన్ రెడ్డి

నవతెలంగాణ- నవీపేట్



మండలంలోని మోకన్ పల్లి సర్పంచ్ రొడ్డ సుధాకర్ పెంకుటిల్లు వర్షానికి కొన్ని రోజుల క్రితం కూలిపోవడంతో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి ఇండ్లు కూలి చాలామంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడంలేదని అన్నారు. వెంటనే నష్టపరిహారం అందించి, సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. ఆయన వెంట బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

సంక్షేమ హాస్టళ్లను సంరక్షించాలి : ఎస్ఎఫ్ఐ

• జిల్లా కార్యదర్శి బోడ అనిల్

• 2 వ రోజు జీపుజాతా

నవతెలంగాణ-డిచ్‌పల్లి

భరత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రెండో రోజు మండల కేంద్రంలోని బాలికల హాస్టల్ నుండి జీపుజాతా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొడ అనిల్ మాట్లాడుతూ.. సంక్షేమ హాస్టల్లను పరిరక్షించాలని ఈ యాత్ర ముఖ్య ఉద్దేశం అని అన్నారు. ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలను స్వాగతిస్తున్నామని, వెంటనే చిత్తశుద్ధితో అమలు చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు దోమతెరలను, ట్రంకు పెట్టెలను అందించాలని డిమాండ్ చేశారు. డిచ్‌పల్లి గర్ల్స్ హాస్టల్ కి నిధులు మంజూరు చేయాలని, ప్రభుత్వ విద్య నూ బలోపేతం చేయాలని అన్నారు. ప్రతి బాలికల హాస్టల్‌కు ఏఎన్ఎం లను రిక్రూట్ చేసి వైద్య సదుపాయాలను మెరుగుపరచాలని అన్నారు. కేజీ టు పీజీ ఉచిత విద్య హామీలు అమలు చేయాలని, ప్రతి మండలానికి రెగ్యులర్ మండల విద్యాశాఖాధికారి పోస్టులను భర్తీ చేయాలని తెలిపారు. కళాశాలలో అధ్యాపకులను రెగ్యులర్ చేయాలనీ అదే విధంగా సంక్షేమ హాస్టల్లో సమస్యలపై సర్వే నిర్వహించి వచ్చిన సమస్యలపై భవిష్యత్తులో జిల్లా కలెక్టరేట్లను ముట్టడి చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విగ్నేష్, జిల్లా ఉపాధ్యక్షులు సిద్దాల నాగరాజు, మహేష్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు దీపిక, జిల్లా నాయకులు జవహార్ సింగ్, నాయకులు సంధ్య రెడ్డి అరవింద్,శివ, బాబురావు తదితర నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఆటోబోల్తా పలువురికి గాయాలు

నవతెలంగాణ-ఏర్గట్ల

ఆటోబోల్తా పడిన ఘటనలో దోంచంద గ్రామానికి చెందిన పలువురు వ్యవసాయ కూలీలు గాయపడ్డారు. ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మోర్తాడ్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన వ్యక్తి ఆటోలో దోంచంద గ్రామానికి చెందిన 15మంది వ్యవసాయ కూలీలను ఉదయం 7.30 సమయంలో దోంచందనుండి తిమ్మాపూర్ గ్రామంలో వరినాట్లు వేయడానికి వెళ్తున్నారు. ఆటో తాళ్ళ రాంపూర్ రాగానే బండను ఢీకొని బోల్తా పడింది. ఆటో తిమ్మాపూర్ గ్రామానికి చెందిన తిరుకోవెల మురళిదిగా గుర్తించామని, మురళి అతివేగంగా అజాగ్రత్తగా నడపడం వల్ల ప్రమాదం జరిగిందని ఎస్సై తెలిపారు. ఆటోలో ప్రయాణిస్తున్న దండుగుల లక్ష్మీ తీవ్రంగా గాయపడడంతో ఆమె కోడలు హేమశ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. ఆటోలో ప్రయాణిస్తున్న పలువురికి తీవ్రగాయలయినట్లు ఆయన తెలిపారు.



గాయపడ్డ మహిళ

గురుమాతంగి నాని యాదవ్‌కు సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఆషాడ మాసంలో భాగ్యనగరంలో నిర్వహించిన బోనాల పండుగలో భాగంగా తెలంగాణ ఉజ్వల సాంస్కృతిక సామాజిక స్వచ్ఛంద సేవా సంస్థ వారు ఇందూరు గురు మాతంగి నాని యాదవ్‌కి ఐకాన్ ఉత్తమ బోనం అవార్డు అందజేశారు. ఈసందర్భంగా ఆయన్ను పడకల్ గ్రామానికి చెందిన బట్టి దత్తాద్రి గౌడ్ చిరు సన్మానం చేశారు.



సత్కరిస్తున్న గ్రామవాసి

నేడు గంగా హాస్పిటల్‌లో ఉచిత పరీక్షలు

నవతెలంగాణ-ఆర్మూర్

నేడు పట్టణంలోని గంగా హాస్పిటల్‌లో ఉచిత ఎముక ఖనిజ సాంద్రత పరీక్ష నిర్వహిస్తున్నట్టు ఆస్పత్రి వైద్యులు ఏలేటి అమృత్ రాంరెడ్డి ఆదివారం తెలిపారు. 45 సంవత్సరాలు పైబడిన వారు తీవ్రమైన నడుము నొప్పి, కీళ్ళ నొప్పుల పరీక్షలకు బీఎంబి పరీక్ష చేయాల్సిన అవసరం ఉంటుందని అన్నారు. ఈ పరీక్షను ఉచితంగా అందిస్తామని, ఉదయం 10 నుండి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ఘనంగా డీసీసీబీ చైర్మన్ జన్మదిన వేడుకలు



గజమాల వేస్తున్న నాయకులు, అభిమానులు

నవతెలంగాణ-వర్ని

ఉమ్మడి జిల్లాల డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలను తల్లిదండ్రులు స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, పుష్పమ్మ సమక్షంలో ఆదివారం బాన్సువాడలో తన నివాసంలో ఘనంగా జరుపుకొన్నారు. స్పీకర్ కేక్ కట్ చేసి తినిపించారు. ఉమ్మడి వర్ని, రుద్రూర్, చందూర్, మోస్రా మండల ప్రజాప్రతినిధులు, పోచారం అభిమానులు, నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో పలు చోట్ల భారీ కేక్ కట్ చేశారు. మల్లారం నుండి వర్ని వచ్చే దారిలో భారీ ర్యాలీతో గజ మాలలతో ఘనంగా పార్టీ ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికారు. మండల కేంద్రాలలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి మండల ఏఎంసి చైర్మన్ మూడ్ కవిత అంబర్ సింగ్, మండల అధ్యక్షులు గిరి, హన్మంత్ రెడ్డి, పత్తి లక్ష్మణ్, జడ్పీటీసీలు భాస్కర్ రెడ్డి, హరిదాస్ నాయక్, నారోజీ గంగారాం, సర్పంచ్‌లు బొద్దోళ్ల సత్యనారాయణ, కర్లం సాయరెడ్డి, పిఏసీఎస్ చైర్మన్లు కృష్ణ రెడ్డి, ప్యారం అశోక్, సుధాకర్ రెడ్డి, ఏ ఎం సి వైస్ చైర్మన్ గోపాల్, జాకోరా సర్పంచ్ గోదావరి గణేష్, సర్పంచ్‌ల ఉపాధ్యక్షులు సత్తిబాబు, అక్బర్ నగర్ సర్పంచ్ గంగామణి వరప్రసాద్ పాల్గొన్నారు. భారీ ర్యాలీతో, గజా మాలలు వేసి మండల కేంద్ర సరిహద్దులాల్లో స్వాగతం పలికారు.



భాస్కర్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న పోచారం

ఎస్సీ రూరల్ అధ్యక్షునిగా ఎన్నికైన పాశం కుమార్‌కు సత్కారం

దళితుల అభినందనలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్వాయి మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పాశం కుమార్ నిజామాబాద్ రూరల్ ఎస్సీ కన్వీనర్ గా ఆర్టీసీ చైర్మన్, నిజామబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నియామకం చేశారు. ఆదివారం ఇందల్ వాయి బస్టాండ్ అంబేద్కర్ చౌరస్తా వద్ద కన్వీనర్‌గా ఎన్నికైన పాశం కుమార్‌కు పూలమాలలు, శాలువాతో అంబెడ్కర్ సంఘ సభ్యులు, జర్నలిస్ట్ మిత్రులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సంగెం కిష్టయ్య మాట్లాడుతూ దళితుల పక్షాన ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ చొవతో పాశం కుమార్ కు పదవి దక్కిందన్నారని అన్నారు. పాశం కుమార్ మాట్లాడుతూ దళితుల పక్షాన అనునిత్యం పోరాటం చేస్తూ దళితులకు ఏ పథకాలు వచ్చిన వర్తించేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో చెక్‌పవర్ ఎర్రోళ్ల సాయన్న, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామా బాదు నగరంలోని కింగ్స్ ఫంక్షన్ హాల్ లో ఆదివారం అంకం హాస్పిటల్, మైనారిటీ ప్రాక్టీషనర్స్ మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి సుమారు ఐదువందల మందికి పైగా హాజరు కాగా వారికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ అంకం గణేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ మంచిది కాదని పేర్కొన్నారు. గైనకాలజీ, ఈఎస్ టీ, ఆర్థోపెడిక్ యూరాలజి, డెంటల్, న్యూరో, క్యాన్సర్, వైద్యులు అంకం భానుప్రియ, కొండ సంతోష్, బిజ్జు శబరినాథ్, విజయలక్ష్మి, చైతన్య, శిరీష ధర్మసాగర్ ,అంకం హాస్పిటల్ చైర్మెన్ అంకం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యం చేస్తున్న డాక్టర్లు

గుర్తు తెలియని మృత దేహం లభ్యం

నవతెలంగాణ-ముప్కాల్

ఎస్సారెస్పీ ప్రాజెక్టు పరిసర ప్రాంతం ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామ శివారులో ఆదివారం గోదావరి నదిలో గుర్తు తెలియని మృత దేహం లభ్యమైనట్లు ఎస్ఐ భాస్కరా చారి తెలిపారు. ఐదు రోజుల క్రితం 45 నుంచి 50 సంవత్సరాల మధ్య గల గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడివుంటారని అన్నారు. మృతుడు సబ్బు కలర్ చొక్క ధరించి ఉన్నాడని తెలిపారు. ఐదు రోజులుగా నీటిలో మృత దేహం ఉండడంతో ముఖం గుర్తుపట్టలేన్నంతగా వుందని తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాల్కొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి వుందని అన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు..

తండాలలో ఘనంగా తీజ్ పండగ

• పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ భూపతి రెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలం లోని ఇందల్ వాయి తండా, రంజిత్ నాయక్ తండా, గండి తండాలలో మహిళలు తీజ్ పండగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ రూరల్ ఇంచార్జీ డాక్టర్ భూపతి రెడ్డి ప్రత్యేక పూజలు, బోగ్ బండర్ లో పాల్గొన్నారు. తండావాసులు జగదంబ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ భూపతి రెడ్డి మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం గిరిజన మహిళలు తీజ్ నిమజ్జనం చేసుకుంటారని, పెళ్లికానీ ఆడ పిల్లలు మందిరాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే తండా అభివృద్ధి కి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్, సంతోష్ రెడ్డి, నారాయణ నాయక్,రత్తు నాయక్,ఉప సర్పంచ్ నవీన్ గౌడ్, బైరయ్య,తండా పేద్ద శంకర్,

రంజీత్‌నాయక్ హీరాబాయి సీతారాం అధ్వర్యంలో తీజ్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఇందల్ వాయి సహకార సొసైటీ వైస్ చైర్మన్ మారుతి నాయక్, తండాపెద్దలు అంబర్ సింగ్, రాజు రంగి, లక్ష్మన్, రతన్, చందర్ పూజారి, మనోజ్ నాయక్ పాల్గొన్నారు.



తీజ్ వేడుకల్లో పాల్గొన్న భూపతిరెడ్డి

బీఆర్ఎస్ నాయకునికి సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ ఎంఆర్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన నటరాజ నృత్య నికేతన్ వారి చిన్నారుల నాట్య ప్రదర్శన అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆశన్న గారి రాజేశ్వర్ రెడ్డి నాయకులు పండిత్ ప్రేమ్ తో పాటు పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్, నటరాజ నృత్యానికేతన్ నాట్య గురువు మాడవేటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

కార్మికుల పోరాట ఫలితమే రూ.3వేల వేతనం

• ప్రకటించిన నాటినుండి ఏరియర్స్‌తో చెల్లించాలి

• స్లాబ్‌రేట్ పెంచేవరకూ పాతమెనూ

• తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజులపాటు నిర్వహించిన టోకెన్ సమ్మె ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి మూడు వేల రూపాయల వేతనాన్ని జూలై నెలనుండి అమలు చేస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇది మధ్యాహ్న భోజన కార్మికుల పోరాట విజయమని అన్నారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సిఐటియు జిల్లా కమిటీ సమావేశం నాందేవ్ వాడలోని సిఐటియు కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ.. పెంచిన వేతనాన్ని పెండింగ్ ఏరియర్స్‌తో సహా ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రకటించిన నాటి నుండి చెల్లించాలని డిమాండ్ చేశారు, స్లాబ్ రేటు పెంచే వరకు పాత మెనూ ప్రకారమే వంట చేస్తామని అన్నారు. జిల్లాలో పెండింగ్లో ఉన్న ఎనిమిది కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్ల అందరికీ ఇస్తున్నట్టుగానే డ్రెస్ కోడ్ అమలు చేయాలని, కొత్త వంట పాత్రలు ఇవ్వాలని, వంట షెడ్లు కట్టించాలని, ప్రమాద బీమా సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు, సమస్యల పరిష్కారం కోసం కార్మికులందరూ పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండగంగాధర్, ఉపాధ్యక్షులు సురేందర్ రెడ్డి, సుజాత, పర్వవ్వ, రజియా బేగం, గంగామణి, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్యాల గోవర్ధన్

చంద్రశేఖర్ ఆజాద్ స్ఫూర్తితో ముందుకెళ్లాలి

• ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్‌సిటీ

చంద్రశేఖర్ ఆజాద్ జీవిత స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు వెళ్లాలని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. ఆదివారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ నగర కమిటీ అధ్వర్యంలో చంద్రశేఖర్ ఆజాద్ 117వ జయంతిని స్థానిక ఎస్సీ హాస్టల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు గణేష్ మాట్లాడుతూ.. భారత దేశ స్వాతంత్రం కోసం అనేక మంది మహానుభావులు తమ జీవితాలను త్యాగం చేశారన్నారు. అందులో చంద్రశేఖర్ ఆజాద్ అతి చిన్న వయసులోనే దేశ స్వాతంత్రం కోసం తన పోరాటాన్ని ప్రారంభించి అనేకమంది యువకులను ఉత్తేజితులను చేసి వారిలో దేశభక్తిని పెంపొందించి దేశ స్వాతంత్రం కోసం వారందరూ పోరాడేలా విశేషమైన కృషి చేశారన్నారు. ఒక బ్రిటిషర్ తుపాకి తూటాకు కాదు.. నా తూటాతో నేను చనిపోతానని చెప్పి దేశ ఖ్యాతిని పౌరుషాన్ని ప్రపంచానికి తెలియజేసేలా తన ప్రాణ త్యాగం నటువంటి చంద్రశేఖర్ ఆజాద్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత, విద్యార్థులు సమాజ సమస్యలు, విద్యారంగ సమస్యల పట్ల ఆజాద్ పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. దేశాభివృద్ధిలో భాగస్వాములవ్వాలని అన్నారు. కార్యక్రమంలో హాస్టల్ కమిటీ నాయకులు అజయ్ ,విష్ణు,రాజు,బాబు తదిరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌సిటీ :స్వరాజ్యం కోసం పోరాటమే సరైన మార్గమని, నమ్మిన సిద్ధాంతం అని తిలక్ యూత్ సొసైటీ అధ్యక్షుడు టి. శ్రీనివాస్, కార్యదర్శి జీ. భీమన్న అన్నారు. బాలగంగాధర్ తిలక్ జయంతి సందర్భంగా నిజామాబాద్ నగరంలోని దుబ్బ ప్రాంతంలో తిలక్ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తిలక్ యూత్ సొసైటీ అధ్యక్షుడు టి. శ్రీనివాస్, కార్యదర్శి జీ. భీమన్న మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి అన్యాయం ఎక్కడ జరిగినా సహించని సహజగుణం అని అన్నారు. తాను నమ్మిన సిద్ధాంతంతో దేశవ్యాప్తంగా సామాన్యప్రజల్ని ఉద్యమంలో పాల్గొనేటట్లు చేయడంలో తన పాత్ర పోషించారని అన్నారు. కార్యక్రమంలో టి.సత్యనారయణ, టి.రాజశేఖర్ యూత్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

బిజెపి, కాంగ్రెస్ పార్టీ నాయకుల అబద్ధపు మాటలు నమ్మొద్దు

• ఆర్టీసీ చైర్మన్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

• సెంటర్ లైటింగ్, డివైడర్ పనులకు శంకుస్థాపన

• త్వరలో డయాలసిస్, డిగ్రీ కళాశాల

నవతెలంగాణ-డిచ్‌పల్లి

బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాటలు చెప్పడంతప్ప ప్రజలకు చేసిందేమీలేదని, అబద్దపు మాటలు నమ్మొద్దని ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. నిజామాబాద్ జిల్లా నుండి డిచ్ పల్లి వరకు 15 కిలోమీటర్ల మేర నుడా నిధులు కోటి 20 లక్షలతో సెంట్రల్ లైటింగ్, డివైడర్ పనులకు అదనంగా మంజూరు కానున్నాయని తెలిపారు. డిచ్పల్లి నుండి ఆర్మూర్ వరకు వెళ్లే రోడ్డు డివైడర్, సెంట్రల్ లైటింగా మారుస్తానని, డిచ్‌పల్లి మండల కేంద్రంలో డయాలసిస్ సెంటర్ మంజూరు అయ్యిందని, తొందర్లోనే డిచ్పల్లి మండలానికి డిగ్రీ కాలేజ్ మంజూరు కానుందని తెలిపారు. నిజామాబాద్, ధర్మారం బి, డిచ్ పల్లి హైవే రోడ్డుకు సెంటర్ లైటింగ్, డివైడర్ పనులు, నిజామాబాద్ నుండి నడిపల్లి వరకు సెంటర్ లైటింగ్, డివైడర్ పనులు గతంలో పూర్తి అయ్యాయన్నారు. ఆదివారం నడిపల్లి నుండి డిచ్‌పల్లి నేషనల్ హైవే వరకు మిగిలిపోయిన పనులకు రూ.2 కోట్ల 66 లక్షల రూపాయలు ముఖ్యమంత్రి నిధుల నుడి ఆర్ అండ్ బి శాఖ ద్వారా సమకూర్చారన్నారు. ఆ నిధులతో టెండర్ కూడా కంప్లీట్ చేయడం జరిగిందని, దానిలో భాగంగానే శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఇవే కాకుండా నిజామాబాద్ నుండి డిచ్పల్లి వరకు 15 కిలోమీటర్ల పొడవుతో అదనంగా నూడ నిధులు రూ కోటి 20 లక్షలు మంజూరు కానున్నాయని ఆయన పేర్కొన్నారు. కాలేశ్వరం నుండి నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి సాగునీరు తొందర్లోని అందనుందది, దీనికి రైతులందరూ సహకరించాలని, ఒక పంట ఆపడం వల్ల పైపులైన్ తొందరగా పూర్తవుతా యన్నారు. మంచిప్ప రి సర్వేర్ పనులు కూడా కంప్లీట్ చేసి నిజామాబాద్ రూరల్ రైతాంగానికి సాగునీరు అందిచనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా యువ నాయకులు, జిల్లా ఒలంపిక్ ఉపాధ్యక్షులు, ధర్పల్లి జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్మోహన్, ఉమ్మడి జిల్లాల డిసిఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, జడ్పిటిసి దాసరి ఇందిరా లక్ష్మీ నర్సయ్య, మండల అధ్యక్షులు చింత శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు మోహన్ రెడ్డి, యూత్ అధ్యక్షులు అమీర్ ఖాన్, సొసైటీ చైర్మన్లు గజవడ జైపాల్, తారాచంద్, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు సాయిలు, మాజీ మండల అధ్యక్షులు శక్కరి కోండ కృష్ణ,కో ఆప్షన్ సభ్యులు షేక్ నయీమ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనాల నిర్మాణం కోసం ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తన నిధుల నుంచి రూ. 50 లక్షలను అందించారు మండలంలో మెంట్రాజ్ పల్లి గ్రామ మాల సంఘానికి 7.50 లక్షలు, గొల్లపల్లి గ్రామ మాదిగ సంఘానికి 7.50 లక్షలు, ఘన్పూర్ గ్రామ మాల సంఘానికి 7.50లక్షలు మాదిగ సంఘాలకు 7.50. లక్షలు, మండల కేంద్రంలో 20 లక్షల రూపాయలు బంజారా భవన్‌కు నిధులను మంజూరు చేయించి ప్రోసిడింగ్ ఆర్డర్స్ పత్రాలను పంపిణీ చేశారు



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

స్పష్టమైన హామీ ఇవ్వకుండా సమ్మె విరమించమంటే ఎలా?

నవతెలంగాణ-నవీపేట్

గ్రామపంచాయతీ సిబ్బంది సమ్మెపై రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి చర్చల పేరుతో పిలిచి స్పష్టమైన హామీ ఇవ్వకుండా కార్మికులు సమ్మె విరమించాలని కోరడం ఎంతవరకు సమంజసమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాయక్‌వాడి శ్రీనివాస్ ప్రశ్నించారు. మండల కేంద్రంలో పంచాయతీ సిబ్బంది 18వ రోజు సమ్మెలో పాల్గొని ఆయన మాట్లాడారు రాష్ట్ర ప్రభుత్వం దళిత, గిరిజనులైన కార్మికులపై మొదటి నుండి బల ప్రయోగం చేసి సమ్మె విరమించే ప్రయత్నం చేస్తుందని ఇప్పటికైనా అటువంటి చర్యలు మానుకొని సమ్మె డిమాండ్లను పరిష్కరించే విధంగా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో మీన్ కుమార్, ఆంజనేయులు లక్క గంగారం లక్ష్మణ్, దేవకి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయక్‌వాడి శ్రీనివాస్

కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే మణిపూర్‌లో హింస : సీపీఐ



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కోటగిరి

కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే మణిపూర్‌లో హింస చెలరేగుతోందని సిపిఐ మండల కార్యదర్శి విట్టల్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సామూహిక అత్యాచారం హింసను నిరసిస్తూ బస్టాండ్ ఆవరణలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ ను ఆదివారం దహనం చేశారు ఈ సందర్భంగా విటల్ గౌడ్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే మణిపూర్లో అల్లర్లు, హింస చెలరేగుతుందని, మణిపూర్ లో కుకి తెగకు చెందిన గిరిజన మహిళలను హింసిస్తూ నగ్నంగా ఊరేగించి సామూహిక అత్యాచార ఘటనపై ప్రపంచమే తలదించుకుంటుందని వాపోయారు. దీనిపై హెూం శాఖ మంత్రి అమిత్‌షా, దేశ ప్రధాని నరేందర్ మోడీ బాధ్యత వహించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించలేకపోవడం సిగ్గుచేటని, భారత దేశమే తలదించుకునేలా ఉందని అన్నారు. ఈ ఘటనపై మానవతా వాదులు, ప్రజా సంఘాలు, మేధావులు స్పందించి దోషులపై ఎస్సీ ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించే వరకు ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నల్ల గంగాధర్, నీలి దత్తు, ఎడ్డెడి దత్తు, రమణమ్మ పుష్ప, సత్యవతి, ఉష, వాణి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-ముప్కాల్

విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి జిల్లా అధ్యక్షులు గోపు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో దివ్యంగులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్రంలో దివ్యాంగులకు ప్రతి నెల అందే ఆసరా పింఛన్ రూ.3,016 రూపాయలకు అదనంగా మరో వెయ్యి రూపాయలను పెంచుతూ సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం మేరకు శనివారం పెంచిన వెయ్యి రూపాయలు జులై నెల నుంచి అందేలా జీవో విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి జిల్లా అధ్యక్షుడు గోపు శ్రీకాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్ప రాధ, మండల ప్రెసిడెంట్ శ్రీరామ్ సాగర్, సుఖిదాస్, కుంటా గంగారెడ్డి, మోతే దేవేందర్ పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రానికి చెందిన పలువురు లబ్దిదారులకు సర్పంచ్ జక్కం చంద్రకళా బాలకిషన్ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆదివారం అందజేశారు. పార్టీ నాయకులు నట భోజన్నతో కలిసి పంపిణీ చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ-బిచ్కుంద

గత వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మంజీర పరివాహక ప్రాంతం వైపు అధికారుల నిఘా ఉండదనే ధీమాతో దెగ్లూర్ కు చెందిన కొందరు వ్యక్తులు మహారాష్ట్ర ట్రాక్టర్ల ద్వారా రాత్రి సమయంలో ఇసుక రవాణా చేస్తున్నారు. బిచ్కుంద మండలంలోని ఖథ్గాం గ్రామ మంజీర పరివాహక ప్రాంతం నుండి రాత్రి సమయాల్లో అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండగా తహసిల్దార్ భరత్ రెవెన్యూ అధికారులతో ప్రత్యేక టీం తయారుచేసి శనివారం రాత్రి దెగ్లూర్ ప్రాంతానికి చెందిన ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్ కు తరలించారు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్ పై తదుపరి చర్యల నిమిత్తం పై అధికారులకు సమాచారం అందించినట్లు తహసిల్దార్ తెలిపారు. రాత్రి సమయంలో అనుమతులు లేకుండా ఇసుక రవాణాను అరికట్టడానికి ప్రత్యేక టీంలు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నామని ఎవరైనా అక్రమంగా అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసిల్దార్ హెచ్చరించారు.

'కంచె'ను మించిన ప్రేమ


లేగదూడకు పాలిస్తున్న ఆవు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలో గల గోషాలకు చెందిన ఒక ఆవు మేతకు వెళ్ళగా ఆవు లేగను కంచెలోపల ఉంచారు. సాయంత్రం వేళ తిరిగి రాగా.. బిడ్డకు పాలు ఇచ్చేందుకు ఆవు ఆరాట పడగా.. కంచె అడ్డంకిగా మారింది. బిడ్డ ఆకలి తల్లికే తెలుసంటారు. అలా కంచె ఉన్నా సైతం ఆవు.. తన లేగకు అక్కడే నిలబడి పాలు ఇచ్చింది. అక్కడే ముండ్ల చెట్టు ఉన్నా వాటన్నింటికీ ఓర్చుకొని పాలు ఇవ్వడం గమనార్హం. ఈ సందర్భంగా తల్లిప్రేమకు జాతిభేదం లేదని నిరూపించిందని స్థానికులు పేర్కొన్నారు.

కూలీల కంటే అధ్వానం

- దుర్భరంగా విద్యుత్ శాఖ స్టోర్ హమాలీల జీవనం
- 30 ఏండ్లుగా విధులు..
- జీతం రాదు.. ఉద్యోగ భద్రత లేదు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కార్మికులు.. అందరి కుటుంబాలలో వెలుగులు పంచుతూ వారి జీవితం చీకట్ల మయం అయింది. పాలకులు కరుణించకపోరా.. తమను ఆదుకోకుండా ఉంటారా అని ఏండ్లుగా ఎదురుచూపులే తప్పా.. పట్టించుకున్న వారే కరువైయ్యారు. వెరసి 30-40 ఏండ్లుగా విద్యుత్ శాఖలో స్టోర్ హమాలీల కుటుంబాల జీవనం దుర్భరంగా మారాయి. తమకూ రోజువారీ కూలీ సైతం పడటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏండ్లుగా పని చేస్తున్నా కనీస వేతనం, ఉద్యోగ భద్రత కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. నిజామాబాద్ నగరంలోని విద్యుత్‌శాఖ పవర్‌హౌస్‌లోని స్టోర్ హమాలీలుగా ప్రస్తుతం 16 మంది పని చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్, స్తంబాలు, ఇతర విద్యుత్ పరికరాలను లోడింగ్, అన్‌లోడింగ్ చేసే విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ 350 కేజీల నుండి 1800 కేజీల వరకు బరువు ఉంటుంది. ఈ బరువులను మోయడానికి ఈ కూలీలందరూ కూడా సరిపోకపోవడంతో వారే ప్రత్యేకంగా బరువులు ఎత్తడానికి క్రేన్‌లను ఉపయోగించి ఆ ట్రాన్స్‌ఫార్మర్‌లను వాహనాలలోకి ఎక్కించడం దించడం చేస్తారు. ఇంత కష్టపడి పని చేస్తున్నా వీరికి ఇప్పటి వరకు వేతనాలు లేవు. కేవలం లోడింగ్, అన్‌లోడింగ్ చేసిన వాటికే డబ్బులు చెల్లిస్తున్నారు. సీజన్ ఉన్నప్పుడు పని ఉంటుందని, అప్పుడే డబ్బులు వస్తాయని, అన్‌సీజన్‌లో పని లేక కుటుంబాల పోషణ దుర్భరంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పని


హమాలీలు



చేస్తున్న కార్మికులు ఒక్కో కార్మికుడు 17 సంవత్సరాల నుంచి 32 సంవత్సరాలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఎంతో మంది కార్మికులు పని చేసి వెళ్లిపోగా.. తండ్రుల స్థానంలో అదే శాఖలో కొడుకులు వచ్చి ఇక్కడే హమాలీ కార్మికుడిగా పనిచేస్తున్నారు. వారు చేసే పనికి రోజువారి ఖచ్చితమైన కూలీ ధర లేకుండానే, నిర్ణయించకుండానే పనులు చేయించుకుంటున్నారు. విద్యుత్ పరికరాలల్లో ఒక్కో వస్తువుకు ఒక్కో ధర నిర్ణయించి దాని ప్రకారం లోడింగ్, అన్‌లోడింగ్‌కు డబ్బులు చెల్లిస్తున్నారు. ఆ పద్ధతిలో నెలంతా పని చేసినా వారికి కనీసం రోజు వారీ కూలీ సైతం పడటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారు నెల మొత్తంలో చేసిన పనికి ఒక ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్ ద్వారా లెక్కలు వేసి జరిగిన పనికి బిల్లు చెల్లిస్తారు. ఆ మొత్తం బిల్లులో 16 మంది కార్మికులు పంపిణీ చేసుకుంటే సీజన్‌లో ఒక్కొక్కరికి నెలకు రూ.8000 నుండి 11 వేల వరకు మాత్రమే కూలి వస్తుంది. అన్‌సీజన్‌లో మరింత తక్కువ వస్తుందని వాపోతున్నారు.

గొడ్డు కష్టం..

విద్యుత్ శాఖ హమాలీలు రెక్కలు ముక్కలు చేసుకొని ట్రాన్స్‌ఫార్మర్‌లు, కండక్ట్ (వైర్), కేబుల్, క్లాంపులు, క్రాసర్లు, ఇన్సులేటర్లు తదితర వాటిని లోడింగ్ అన్‌లోడింగ్ చేస్తుంటారు. అడ్డా మీద రోజు వారి కూలీగా వెళ్తే.. కనీసం రూ.700-1000 చెల్లిస్తున్నారని, కానీ ఇక్కడ గొడ్డు కష్టం చేస్తున్నా. పనికి తగ్గ ఫలితం మాత్రం దక్కడం లేదని హమాలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు తమను గుర్తించకపోరా.. తమకు ఉద్యోగ భద్రత కల్పించకపోరా అనే ఆశతో పని ఎంతో కష్టంగా ఉన్నా రెక్కలు ముక్కలు చేసుకొని పని చేస్తున్నామని పేర్కొంటున్నారు. ప్రభుత్వం తమ సేవలను గుర్తించి కనీస వేతనం అమలు చేసి, పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని విద్యుత్‌శాఖలో పని చేసే స్టోర్ హమాలీలు కోరుతున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నూతన ఏసీపీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీపై వస్తున్న జగదీష్ చందర్ ఆదివారం స్థానిక ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్మూర్ ప్రాంత ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలను అందించాలని కోరారు . ఎమ్మెల్యే ఏసీపీకి శుభాకాంక్షలు తెలిపారు.

పున: ప్రారంభమైన మహిళా సంఘ భవన నిర్మాణ పనులు


పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్, మహిళలు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని సుర్బిర్యాల్ గ్రామంలోని మహిళా భవన్ మిగులు పనులకు ఆశన్నగారి జీవన్‌రెడ్డి 5 లక్షల రూపాయల ప్రొసీడింగ్ ఇవ్వగా సర్పంచ్ సట్లపల్లి సవితగణేష్ పనులను ఆదివారం ప్రారంభించారు. గ్రామంలోని మహిళా సంఘాల అధ్యక్షులు, నాయకులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఐకెపి సిసి జ్యోతి , రోహిత, సత్యగంగు, లక్ష్మి, సవిత, మానస, లాస్య, సుస్మిత, కవిత తదితరులు పాల్గొన్నారు.

మోపాల్ ఎస్సైగా ఎల్. రామ్



మోపాల్ ఎస్సైగా ఎల్ రామ్

నవతెలంగాణ మోపాల్

మోపాల్ ఎస్ఐగా శనివారం ఎల్ రామ్ బాధ్యతలు చేపట్టారు. జగిత్యాల జిల్లా కేంద్రం నుండి ఇక్కడికి బదిలీపై వచ్చారు. మండల కేంద్రంలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఈ సమస్య వచ్చినా కూడా పోలీస్‌స్టేషన్లో 24 గంటల సేవలందిస్తానని, బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఆయన తెలిపారు.

గ్రామాల్లో పీర్ల పండుగ షురూ


మసీదులలో ప్రతిష్ఠించిన పీరీలు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం మసీదులలో పీరీలను ప్రతిష్ఠించారు. నెలవంక రావడంతో మొహరం నెల ప్రారంభమైంది. ఈనెల 29న మొహరం పండుగ ఉంది. ఇందులో బాగానే గ్రామాల్లో హిందూ ముస్లింలు సోదర భావంతో గ్రామాల్లోని మసీదులలో పీరీలను ప్రతిష్ఠించారు. మండలంలోని పలు గ్రామాలతో పాటు లింగంపేట్ మండల కేంద్రంలో నాలె హజార్ మసీదులో బారే మామ, లాల్ సాబ్, నాలె హజార్, కాశందుల హుస్సేనీ ఆలం, హుస్సేనీయాలం పీర్లను ప్రతిష్ఠించారు. వారం రోజులపాటు మసీదుల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు హిందూ ముస్లింలు కుడుకలు బెల్లం పోసి మొక్కులను సమర్పించుకోనున్నట్లు తెలిపారు.

సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


గ్రామ సర్పంచ్ రాజు పటేల్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-మద్నూర్

సీఎం రిలీఫ్ ఫండ్ పథకం అనారోగ్యానికి గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారికి ఆసరాగా నిలుస్తుందని డోంగ్లి మండలంలోని మాదన్ ఇప్పర్గా గ్రామ సర్పంచ్ రాజు పటేల్ తెలిపారు. గ్రామంలోని పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా మంజూరైన చెక్కులను ఆదివారం సర్పంచ్ రాజు పటేల్ చేతుల మీదుగా ఆ గ్రామ పెద్దలు అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మదన్ హిప్పర్గ గ్రామానికి చెందిన రామా తండ్రి పోచబోయి 60,000-/ భూదేవి, 14,500-/ నిర్మాలబాయి 16,500, హన్మంతరావ్ హర్సెవార్ 30,500-/ లబ్ది దారులకు అందజేశారు. కార్యక్రమంలో విలాస్ గైక్వాడ్, విఠల్ రావ్ పటేల్, వెంకట్ పటేల్, పోసెటి హన్మంత్ ,ప్రకాష్ పాటిల్, నాని గ్రామ పెద్దలు తదితరులు లబ్ధిదారులు పాల్గొన్నారు.


కార్యకర్త పార్థివదేహానికి నివాళ్లు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని తానకుర్ది గ్రామానికి చెందిన పెరిక జనార్ధన్ అనారోగ్యంతో మృతి చెందగా పార్థివ దేహానికి టిపిసిసి కార్యదర్శి మాజీ నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆదివారం నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ఓదార్చే సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మోపల్ మండల్ కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ సాయి కుమార్, సర్పంచి లతా భూషణ్, పాషా, రవి, అంచా ప్రశాంత్, మహేష్, నాగార్జున పునాకర్ తదితరులు పాల్గొన్నారు

కుంగిన కల్వర్టు

- ఇటీవలే నిర్మాణం


కుంగి పోయిన రోడ్డు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దూపల్లి, రెంజల్ గ్రామాల మధ్య ఇటీవల నిర్మించిన కల్వర్టులు కుంగి పోవటంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని వారు ఆరోపించారు. నూతనంగా నిర్మించిన కల్వర్టులు పైప్ లైన్ లేకపోవడంతో నాసిరకంగా తయారు అయిందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ తో తిరిగి కల్వర్టు వద్ద మరమ్మత్తులు జరిపించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఎస్‌హెచ్‌ఓ ఆర్థికసాయం

నవతెలంగాణ-ఆర్మూర్

స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మాక్లూర్ మండలం అమ్రాద్ తండాకు చెందిన హోంగార్డ్ దేగావత్ గంగారాం హార్ట్‌ఎటాక్‌తో చనిపోయారు. అంత్యక్రియల కోసం స్టేషన్ హౌస్ ఆఫీసర్ బి. సురేష్ బాబు ఆదివారం 20వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు తోటి హోంగార్డ్స్ ధన్యవాదములు తెలిపారు.

మణిపూర్‌లో అల్లర్లు, హింసకు

కేంద్రమే బాధ్యత వహించాలి

- దోషులను కఠినంగా శిక్షించి బాధిత మహిళల కుటుంబాలను ఆదుకోవాలి
- ప్రజాపంథా ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

మణిపూర్ గిరిజన మహిళలపై లైంగికదాడి ఘటనలను నిరసిస్తూ.. అక్కడ అల్లర్లకు, హింసపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు మండిపడ్డారు. ఈ ఘటనలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ పార్టీ కామారెడ్డి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ వద్ద ఆదివారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి బాలరాజ్ సహాయ కార్యదర్శి ప్రకాష్ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో కుకీ తెగకు చెందిన ముగ్గురు గిరిజన మహిళలను వివస్త్రను చేసి, అమానుషంగా హింసిస్తూ, నగ్నంగా ఊరేగించి, సామూహిక హత్యాచారం చేసిన ఘటన పట్ల ప్రపంచమే దిగ్భ్రాంతికి గురైందన్నారు. ఈ అమానుష ఘటనలో పాల్గొన్న వారందరిపై లైంగికదాడి, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. బాధిత మహిళల కుటుంబాలకు 50 లక్షల రూపాయలు చొప్పున ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, వంద రోజులుగా జరుగుతున్న అల్లర్లలో ప్రాణాలు, ఆస్తులు కోల్పోయిన బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించి, భద్రత కల్పించాలన్నారు. మణిపూర్లో నిరవధికంగా అల్లర్లు, హింస జరుగుతుంటే, బీజేపీ నాయకత్వంలోని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. మణిపూర్ అల్లర్లు, అమానుష ఘటన పట్ల సుప్రీంకోర్టు హెచ్చరిస్తే గానీ, మోడీ ప్రభుత్వానికి చలనం రాలేదన్నారు. మోడీ ప్రభుత్వ విద్వేష, మతోన్మాద, విభజన రాజకీయాల ఫలితమే మణిపూర్ అల్లర్లు అని ఆరోపించారు. నరేంద్ర మోడీ విద్వేష రాజకీయాలను వీడి తక్షణమే మణిపూర్ రాష్ట్రంలో పర్యటించాలని, రాష్ట్రంలో శాంతిభద్రతలు నెలకొల్పాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ మనువాద, మతోన్మాద, విద్వేష, విభజన రాజకీయాలను ఎండగట్టాలని ప్రజలు, ప్రజాస్వామ్య వాదులను కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పి వై ఎల్ జిల్లా నాయకులు శ్రీనివాస్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు జి సురేష్, ప్రధాన కార్యదర్శి అనిల్, సహాయ కార్యదర్శి కృష్ణ, నాయకులు సురేంద్ర ,శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనంచేసున్న సీపీఐ నాయకులు

రూ.7200 ఇస్తే 'ఐదు లక్షల ఇల్లు'

- డబుల్ బెడ్ రూం ఇండ్ల పేరుతో డబ్బులు వసూలు
- ప్రొసీడింగు లేదు.. పేర్లు రాలేదు
- కట్టుకునే వారికి బిల్లులు లేవు

నవతెలంగాణ-మద్నూర్

డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం గృహలక్ష్మి పథకం తీసుకొచ్చిన విషయం విధితమే. అయితే ఐదు లక్షలు మంజూరు చేయిస్తామని పలువురు నుంచి అధికార పార్టీ నాయకులు రూ.7200 వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రూ.7200 చెల్లించిన వారికే ఇండ్లు మంజూరు అవుతాయని ప్రచారం చేస్తున్నట్టు సమాచారం. మద్నూర్ మండలంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరైనట్లు ప్రతి గ్రామపంచాయతీకి ఐదు ఇండ్ల చొప్పున మంజూరు అయినట్లు ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు 5 లక్షల రూపాయలు మంజూరైనట్లు వాటి కోసం లబ్ధిదారులు 7200 చెల్లించిన వారికే ఇండ్లు మంజూరు అవుతాయని అధికార పార్టీ నాయకులు ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో పలువురి లబ్ధిదారుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నట్టు సమాచారం. ఇంతకు ఆ డబ్బులు ఎక్కడ కట్టారు ఎవరి పేరు మీద కట్టారు.. అనేది ఏ ఒక్కరికి తెలియక డబ్బులు చెల్లించిన లబ్ధిదారులు అయోమయంగా ఉన్నారు. 'నీవు డబ్బులు కట్టావు. ఇల్లు నిర్మించుకోండి మీకు 5 లక్షల రూపాయలు వస్తాయి' అంటూ తెలపడంతో మద్నూర్ ఉమ్మడి మండలంలో పలు గ్రామ పంచాయతీల పరిధిలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించుకునే వారు ఆశగా ఇంటి నిర్మాణం చేపట్టగా.. ఇప్పటికి డబ్బులు వచ్చిన దాఖలాలు లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం ఇల్లు కట్టుకు నే వారికి ఎంబి రికార్డులు చేసి ఫోటోలు తీసి పై అధికారులకు నివేదికలు పంపిస్తున్నట్లు తెలుపుతున్నారు. కానీ ఇప్పటి వరకు ఒక్క రూపాయి వచ్చిన దాఖలాలు లేవు. దీంతో డబ్బులు కట్టిన వారు ఆవేదన చెందుతున్నారు. నాయకుల మాటలు విని పనులు ప్రారంభించుకున్నామని, ఇప్పటి వరకు డబ్బులు రాకపోవడంతో అప్పుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మధ్యలోనే ఆగిపోయిన డబుల్ బెడ్ రూం పనులు

కేజీవిల్ టాక్టర్ల యజమానులకు నోటీసులు


నోటీస్ అందజేస్తున్న ఎస్ఐ శంకర్

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట మండలంలో ఆయా గ్రామాలలో గల కేజీవీల్ ట్రాక్టర్ యజమానులకు నోటీసులు అందజేసినట్లు ఎస్ఐ శంకర్ ఆదివారం తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో దుక్కులు దున్ని భూమి చదును చేసేందుకు వరునాట్లు వేసేందుకు కేజీవీల్ ట్రాక్టర్లను ఉపయోగిస్తారని, వాటిని రోడ్లపై తిప్పుతుండటంతో బీటీ రోడ్లు పూర్తిగా ధ్వంసమవుతున్నాయని ఆర్అండ్‌బి పంచాయతీరాజ్ శాఖ అధికారులు పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు. రోడ్డు భద్రత కోసం రోడ్లపై కేజీవీల్ ట్రాక్టర్లను నడప రాదని అందుకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించడంతో ఆదేశానుసారం మండలంలోని ఆయా గ్రామాల్లో కేజీ విల్ ట్రాక్టర్లు నడుపుతున్న యజమానులకు గ్రామాల వారిగా నోటీసులను స్థానిక పోలీసులు అందజేసినట్లు తెలిపారు. ట్రాక్టర్లు రోడ్డుపై నడిపించినట్లయితే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా తిప్పితే సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

గౌడ కమిటీ హాల్ భవనానికి శంకుస్థాపన


పనులు ప్రారంభిస్తున్న చైర్మన్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణంలోని ఏడో వార్డులో గౌడ్స్ కమిటీ హాలు భవనానికి ఆదివారం భూమి పూజ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్య నారాయణ నిర్వహించారు. పది లక్షల నిధులతో నిర్మిస్తున్న గౌడ్స్ భవనానికి మరిన్ని నిధులు ఎమ్మెల్యే జాజాల సురేందర్ ద్వారా ఏర్పాటు చేయిస్తానని అందుకు తమ సహకారాలు కూడా బీఆర్ఎస్ పార్టీకి ఉండాలని వారిని మున్సిపల్ చైర్మన్ కోరారు. పట్టణంలో శరవేగంగా కమిటీ హాల్ భవనాల పనులు జరుగుతున్నాయని ఈ భవనం కూడా తొందరగా పూర్తి చేయాలని వారిని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ పద్మ శ్రీకాంత్, పిఎసిసిఎస్ వైస్ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, పట్టణ బి ఆర్ ఎస్ అధికార ప్రతినిధి రామప్ప, మాజీ జెడ్పిటిసి గయాజ్, గౌడ్ సంఘం అధ్యక్షులు బాలకిషన్, బి ఆర్ ఎస్ నాయకులు గాదే తిరుపతి, గౌడ్ సంఘం నాయకులు కిరణ్ గౌడ్ ,ప్రతాప్ గౌడ్ ,శ్రీనివాస్ గౌడ్ ,రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చ్‌కి బ్లీచింగ్ పౌడర్ వితరణ

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని సి ఎస్ ఐ చర్చి కి గాను జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్మరి యాదగిరి బ్లీచింగ్ పౌడర్ బ్యాగులను ఆదివారము అందజేశారు. ఈ సందర్భంగా చర్చి సభ్యులు బాలరాజ్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమ్మెతో చర్చి చుట్టుపక్కల చెత్తాచెదారం నిండిపోయి దుర్వాసన వెదజల్లుతుందని, ఈ ఇబ్బందులను యాదగిరి దృష్టికి తీసుకెల్లగా.. ఆయన స్పందించి బ్లీచింగ్ పౌడర్ బ్యాగులను అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఐ చర్చ్ పాస్టర్ జయరాజ్, కమిటీ సభ్యులు గైని దేవదాస్ , జాన్ , రాజ్, దీన్ దయాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

ప్రెస్‌క్లబ్ పెద్ద కొడప్‌గల్ మండల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా రియాజుద్దీన్, ఉపాధ్యక్షులుగా హాన్మండ్లు, కోశాధికారిగా రూప్ సింగ్‌ను ఎన్నుకున్నారు. తదనంతరం నూతనంగా ఎన్నికైన పదాధికారులను సభ్యులు శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విలేకరులు పాల్గొన్నారు.

నేడు సిద్ధి రామేశ్వర్ నగర్‌లో విప్ పర్యటన

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని సిద్ధిరామేశ్వర నగర్ గ్రామానికి సోమవారం విప్ గంప గోవర్ధన్ పలు అభివృద్ధి పనులు ప్రారంభించడానికి వస్తున్నట్లు బిఆర్ఎస్ మండల అధ్యక్షులు నరసింహారెడ్డి, గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తరలి రావాలని కోరారు.

వర్తక సంఘం కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలో గల వర్తక సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక వర్తక సంఘంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యక్షులుగా తాటిపాముల లింబాద్రి, గౌరవ అధ్యక్షులుగా పబ్బ నాగరాజు, ఉపాధ్యక్షులుగా పురం రాజమౌళి, బాల్ చంద్రం, ప్రధాన కార్యదర్శిగా అతిమాముల రమేష్, కోశాధికారిగా చీకోటి నాగభూషణం ఎన్నికయ్యారు .కార్యవర్గ సభ్యులుగా నంద రమేష్, గజవాడ నాగరాజు, గుంటుకు రాజు, జెపి సిద్ధా గౌడ్, బుర్ల రేణు కుమార్, అతిమాముల శ్రీధర్, చంద్రమోహన్, ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు లింబాద్రి మాట్లాడుతూ సంఘాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని, సభ్యులందరూ తమకు సహకరించాలని కోరారు.

వికలాంగుల పెన్షన్ పెంచడం పట్ల హర్షం

నవతెలంగాణ-లింగంపేట్

వికలాంగుల పెన్షన్ రూ.3016 నుంచి రూ.4016కు పెంచుతూ సీఎం కేసీఆర్ జీవో జారీ చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని పర్మళ్ల గ్రామంలో ఆదివారం వికలాంగులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గతంలో వికలాంగులకు పెన్షన్ రూ. 3016 ఇచ్చే వారని మంచిర్యాలలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ దివ్యాంగులకు 4016 రూ. ఇస్తానని హామీ ఇచ్చారని, అందుకు అనుగుణంగా జీవో జారీ చేసినట్టుతెలిపారు. ఈ సందర్భంగా గ్రామ దివ్యాంగుల అధ్యక్షులు ఈర్ల లక్ష్మయ్య మాట్లాడుతూ దివ్యాంగులను ఆదుకున్న ఆపద్బాంధవుడు అన్నారు. ఈ కార్యక్రమంలో పర్మల్ల దివ్యాంగుల సంఘం సభ్యులు, సర్పంచ్ పర్వయ్య, బి ఆర్ ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు గంట బాబు. లెగ్గల రాజు తదితరులు పాల్గొన్నారు.

కందకుర్తి బ్రిడ్జిపై తనిఖీలు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి బ్రిడ్జి సమీపంలో ఎక్సైజ్ ఎస్ఐ బాలయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలను ఆదిరవారం చేపట్టారు. మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసినట్టు ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్ర నుంచి దేశి దారు 90 ఎం.ఎల్ తరలించిన వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. బ్రిడ్జి మీదుగా గంజాయి లాంటి మత్తు పదార్థాలతో పాటు, మద్యం సరఫరా అవుతుండడంతో ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎక్సైజ్ శాఖ ప్రత్యేక తనిఖీలను చేపట్టినట్లు ఆయన తెలిపారు. ప్రతిరోజు తనిఖీ బృందాలు ఇక్కడ తనిఖీలు చేస్తాయని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట కానిస్టేబుల్ శ్రీనివాస్, జావీద్ ఉన్నారు.

బాలగంగాధర్ తిలక్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ దుబ్బా చౌరస్తాలో గల లోకమాన్య బాలగంగాధర్ తిలక్ 168వ జయంతి సందర్భంగా ఆదివారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మాయ వార్ రాజేశ్వర్ మాట్లాడుతూ.. బాలగంగాధర్ తిలక్ స్వరాజ్యమే నా జన్మ హక్కు అని నినదించిన మహానుభావుడని కొనియాడారు. బాలగంగాధర్ తిలక్ బ్రిటీష్ వారిని ఎదిరించడానికి దేశమంతా గణేష్ ఉత్సవాలను నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేసిన నాయకుడని అన్నారు. కార్యక్రమంలో దామోదర్, మహేందర్ గౌడ్, గోవర్ధన చారి, రంజిత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోవాలి

- వైద్యాధికారి రాజ్ కుమార్

నవతెలంగాణ-ఎడపల్లి

గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆరోగ్య పరీక్షలకోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ సామాగ్రిని ఆస్పత్రులకు పంపిణీ చేసిందని గ్రామీణ ప్రాంత ప్రజలు డిజిటర్ ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి రాజకుమార్ అన్నారు. మండలంలోని తానాకాలన్ గ్రామంలోగల ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన ఆదివారం సందర్శించారు గ్రామంలోని రోగులకు డిజిటల్ బీపీ పరీక్షలను ఆయన నిర్వహించారు. గ్రామంలోని సుమారు వందమందికి పైగా ఆయన డిజిటల్ బిపి పరీక్షలను నిర్వహించారు.

జరభద్రం..

రక్షణ చర్యలు లేకుండా మందు పిచికారి చేస్తే ప్రమాదకరం



రక్షణ చర్యలు లేకుండా పురుగు మందు పిచికారి చేస్తున్న రైతు

నవతెలంగాణ-బోధన్

ప్రస్తుతం వ్యవసాయ పనులు జోరందుకోవడంతో రైతులు ఆదివారం వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా మారారు. మరికొందరు నాట్లు వేయడం, కొంతమంది రైతులు సోయా, వరి పంటకు ఎరువులు చల్లుకోవడం పనిలో బిజీగా కనిపించారు. కొంతమంది రైతులు వ్యవసాయ పనుల్లో భాగంగా పంటలకు పురుగుమందులు పిచికారి చేస్తున్న సమయంలో ఎలాంటి ఆరోగ్య రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. రైతులు పురుగు మందులు పిచికారి చేస్తున్న సమయంలో చేతులకు గ్లౌజులు, ముఖానికి మాస్కులు లేకుండా పురుగు మందులు పిచికారి చేస్తున్నారు. దాంతో మందుల ప్రభావం ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. గతంలో ఈ మందుల ప్రభావంతో ఎందరో రైతులు స్పృహతప్పి ఆసుపత్రి పాలైన ఘటనలు ఉన్నాయి. రైతుల ఆరోగ్య రక్షణపై, మందుల పిచికారిపై వ్యవసాయ శాఖ అధికారులు కనీస అవగాహన కల్పించలేకపోతున్నారు. దాంతో రైతులు ఎలాంటి రక్షణ చర్యలు పాటించకుండా పురుగుమందులు పిచికారి చేస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు పురుగుమందులు పిచికారిపై, రైతులు ఆరోగ్య రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

డ్రైనేజీ మరమ్మతు పనులు



జేసీబీతో మట్టితీసే పనులు చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో డ్రైనేజీ మరమ్మతు పనులను అధికారులు ఆదివారం ప్రారంభించారు. మండల కేంద్రంలో జాతీయ రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులలో భాగంగా పలుచోట్ల గతంలో నిర్మించిన డ్రైనేజీ కల్వర్టులను విస్తరించారు. రోడ్డు విస్తరణతో పాటు సెంట్రల్ లైటింగ్ పనులు ముగిసి ప్రారంభోత్సవం కూడా జరిగింది. అయితే డ్రైనేజీ పనులను మాత్రం అలాగే వదిలేశారు. షాపుల ముందు అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీలతో షాపుల యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో అసంపూర్తిగా వదిలేసిన డ్రైనేజీ మరమ్మత్తు పనులను చేపట్టారు. మురికి కాలువను నిర్మించేందుకు జెసిబితో మట్టి తీసే పనులను నిర్వహిస్తున్నారు.

బాధితునికి సెల్‌ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-సిరికొండ



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ

ధర్పల్లి మండలంలోని సీతాయిపేట గ్రామానికి చెందిన చెప్యాల సుదర్శన్ సిరికొండ మండల కేంద్రంలో తన సెల్ఫోన్ ఎవరో కొట్టేసారని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్సై జి రమేష్ చాకచక్యంతో సిఐఆర్ విధానం ద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ని పట్టుకుని బాధితునికి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు ఈయన వెంట సిబ్బంది రాకేష్ తదితరులు ఉన్నారు.

హాకీ పితామహుడు దాసరి హనుమంతు సంతాప సభ

నవతెలంగాణ-ఆర్మూర్



సంతాపం తెలుపుతున్న క్రీడాకారులు

హాకీ పితామహుడు దాసరి హన్మంతు సంతాప సభను జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. హాకీ క్రీడను నిజామాబాద్ జిల్లాలోనే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రాచుర్యంలోకి తెచ్చిన హన్మంతు ఇటీవల మరణించగా సంతాప సభ నిర్వహించారు. ఎంతో మంది క్రీడాకారులను తయారు చేయడమే కాకుండా వారు ఉన్నత ఉద్యోగాలు సాధించే విధంగా ప్రోత్సహించి క్రీడాకారుల జీవితాలలో వెలుగు నింపిన మంచి మనిషి లేకపోవడం భాదాకరం అని సంతాప సభకు విచ్చేసిన అతిథులు గుర్తుచేసుకున్నారు. సంతాప సభలో హాకీ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ విశాఖ గంగారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ విద్యాసాగర్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ సదమస్తు రమణ, వాలీబాల్ అసోసియేషన్ సెక్రెటరీ మల్లేష్ గౌడ్, కౌన్సిలర్ గంగామోహన్ చక్రు, సాయాగౌడ్ జిమ్నాస్టిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉమామహేశ్వర్ రెడ్డి, మాజీ వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి , బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రెటరీ శ్యామ్, స్వామి, సీనియర్ హాకీ ప్లేయర్ రవీందర్, హనుమాన్ యూత్ క్లబ్ సభ్యులు, హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూమ్ ఇండ్ల కోసం దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇండ్ల కోసం అర్హులైన వారు ఈ నెల 24 నుండి 27 వరకు ఏర్గట్ల గ్రామపంచాయతీలో తమ తమ దరఖాస్తులను అందజేయాలని ఎమ్మార్వో జనార్ధన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు నందు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, తదితర డాక్యుమెంట్లను జతచేసి అందిచాలని కోరారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి

- సిపిఐ ఎంఎల్ రామచంద్రం పార్టీ
- మాదిగ మహిళా సంఘం

నవతెలంగాణ-ఆర్మూర్



కంఠేశ్వర్ :మాట్లాడుతున్న మాదిగ మహిళా సంఘం నాయకులు

మణిపూర్‌లో జరుగుతున్న హింసను ఆపి శాంతిని నెలకొల్పాలని సీపీఐ(యం ఎల్) రామచంద్రన్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బుద్ధ సత్యనారాయణ, ఉత్తర తెలంగాణ కార్యదర్శి ఎస్ సుధాకర్ ఆదివారం డిమాండ్ చేశారు. మణిపూర్‌లో విశాలమైన అటవీ ప్రాంతం ఉందని, అందులో అపారమైన ఖనిజ సంపద దోపిడీకి వాడుకుంటే, ఆదివాసి తెగలు, ఆదివాసీయేతర తెగల మధ్య వైరం సృష్టిం ఆర్ఎస్ఎస్ హిందూ మతోన్మాద శక్తుల అఖండ హిందూ రాజ్యం పేరుతో దారుణాలకు పాల్పడుతున్నా కేంద్రంలోని బీజేపీ, మణిపూర్ ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహిస్తున్నాయని అన్నారు. గుజరాత్ రాష్ట్రంలో దళిత, మైనార్టీ,ఆదివాసీలపై ఇదే హింస జరిగిందని, ఇదే తరహాలో జమ్ము కాశ్మీర్లో అమలులో ఉందనితెలిపారు. ఒక పక్క ప్రజలను కాందీషికులుగా మార్చి ఆర్ఎస్ఎస్ అనుకున్న అఖండ హిదు దేశంకోసం మరో పక్క సహజ సంపద అంతా అగ్రవర్ణాల చేతుల్లో ఉండాలని ఒకే దేశం, ఒకే ప్రజలు, ఒకే చట్టం అని ఇది ఆర్ఎస్ఎస్, బీజేపీ శాసనమని దుయ్యబట్టారు. ఇందులో భాగమే రాజ్యాంగంలో ఉన్న ప్రజాస్వామిక హక్కులను కాలారాస్తున్నది దళిత, మైనార్టీ, ఆదివాసీ ప్రజలను జీవించే హక్కు నుండి దూరం చేయడంలో వీరిపై దేశ వ్యాప్తంగా దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజా హక్కుల కోసం పోరాడే సంస్థల కార్యకర్తలను, అర్బన్ నక్సలైట్, దేశ ద్రోహులు, టెర్రరిస్టులుగా ముద్రవేసి జైల్లో వేస్తున్నారని వాపోయారు. ఈ ఆర్ఎస్ఎస్, బీజేపీ హిందూ పాసిస్టు పాలనకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక వాదులు, కవులు, రచయితలు, కళాకారులు ఐక్య ఉద్యమాలకు కలిసి రావాలని కోరారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కంఠేశ్వర్ : మణిపూర్ రాష్ట్రంలో మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసిన నిందితులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని మాదిగ మహిళ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షురాలు చిలుమల పోసాని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం నగరంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలపై జరిగిన ఆమానుషత్వాన్ని ఆపలేని అసమర్ధపాలకులు వెంటనే రాజీనామా చేయాలని కోరారు. భవిష్యత్తులో మహిళలపై అత్యాచారం హత్యలు జరిగితే ఊరుకునేది లేదని పోసాని హెచ్చరించారు. తక్షణమే వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ నాయకత్వంలో నిరసన తెలిపారు. జిల్లా ఇన్చార్జ్ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు గుండారం మోహన్, జిల్లా అధ్యక్షురాలు లత, నగర అధ్యక్షుడు మల్లమారి సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్, అనురాధ, నీల, మల్లవ్వ, అనుపమ, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో జరిగిన సంఘటనలో స్త్రీలను నగ్నంగా ఊరేగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కెవిపిఎస్ జిల్లా నాయకులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో కులవ్యక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో విలేకరుల ఏర్పాటు చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ గంగాధర్ మాట్లాడుతూ.. మహిపూర్ రాష్ట్రంలో మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించిన ఘటనలపై ఇంతవరకు అక్కడి బీజేపీ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. బిజెపి ప్రభుత్వం ఆవును గోమాతగా పూజిస్తున్నారు కానీ స్త్రీల మానప్రాణాలను తీసినా పట్టించుకోవడంలేదని అన్నారు. ఈ పరిణామానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నల్వాల నరసయ్య, సుజాత, లక్ష్మి, షాబాను పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై రేపు నిరసన జయప్రదం చేయండి

- సీపీఐ, సీపీఐ(ఎం)

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న నాయకులు

మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసకాండను నిరసిస్తూ ఈనెల 25న రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమానికి సిపిఐ, సిపిఎం రాష్ట్ర కమిటీలు ఇచ్చిన పిలుపును జయప్రదం చేయాలని జిల్లా నాయకులు కో రారు. ఆదివారం సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో సిపిఐ(ఎం) నిజామాబాద్ జిల్లా కార్యదర్శి ఏ.రమేష్ బాబు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ... బిజెపి అధికారంలో ఉన్న మణిపూర్ రాష్ట్రంలో తమ రాజకీయ ప్రయోజనాల కోసం రెండు గిరిజన తెగల మధ్య ఆధిపత్య పోరు కోసం విభేదాలను సృష్టించి అరాచకాలు జరుగుతున్నా పట్టించుకోవడంలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కానీ, కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం గానీ జోక్యం చేసుకొని ఉద్రిక్తతలను తగ్గించడానికి చర్యలు చేపట్టలేదన్నారు. అక్కడ గిరిజనులు పేద ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. మహిళలపైనా విచక్షణారహితంగా దాడులు దౌర్జన్యాలు, హింస, మానభంగాలు జరుగుతున్నాయని వాపోయారు. దీని పట్ల నరేంద్ర మోడీ నోరు మెదపకపోవడం అగ్నికి ఆజ్యం పోసినట్లు తయారవుతుందని విమర్శించారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పటానికి ఉద్రిక్తతలకు కారణమైన సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని, కారకులైన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న నిరసన కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. నిజామాబాద్‌లో రైల్వే స్టేషన్ వద్ద నుండి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ, నిరసన కార్యక్రమం ఉంటుందని అన్నారు. జిల్లాలోని పార్టీ నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఐ, సిపిఎం జిల్లా నాయకులు వై.ఓమయ్య పి.ముత్యాలు, రఘురాం, కటారి రాములు, తదితరులు పాల్గొన్నారు.

జీపీ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- సిపిఐ (ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

నవతెలంగాణ-ఎడపల్లి



నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిపిఐ(ఎం) జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు డిమాండ్ చేశారు. జిపి పారిశుధ్య కార్మికుల నిరవధిక సమ్మె ఆదివారానికి 18వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా వారికి మద్దతు పలికి మాట్లాడారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు అమలు చేయాలని, ప్రభుత్వానికి ఇచ్చిన 10వ డిమాండ్లను వెంటనే చర్చించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతి ఎలక్ట్రిసీటీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మండల రాజు, జేఏసీ జిల్లా కన్వీనర్ జంగం గంగాధర్, మండల జెఎసి కన్వీనర్ గంగరాజు, కోకన్వీనర్ పాండు, కుంట సంతోష్, బిల్ కలెక్టర్ యూనియన్ ఎడపల్లి మండల అధ్యక్షులు రాజు, గారిగింట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు

ఆర్థిక సహాయంలో అవినీతి జరగకుండా చూడాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



మాట్లాడుతున్న విశ్వకర్మ యువజన సంఘం నాయకులు

చేతి వృత్తుల వారికి అందిస్తున్న ఆర్థిక సహాయంలో అవినీతి అక్రమాల జరగకుండా చూడాలని అఖిల భారత విశ్వకర్మ యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అఖిల భారత విశ్వకర్మ యువజన సంఘం (ఏబివివైఎస్) అధ్వర్యంలో ఆదివారం శివాజీ నగర్‌లోని కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏబివివైఎస్ నిజామాబాద్ రూరల్ ఇంఛార్జి మట్టెల నరేందర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత బీఆర్ఎస్ పార్టీ మొట్టమొదటిసారి చేతి వృత్తులవారికి లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించాలని తీసుకున్న నిర్ణయం సంతోషించదగ్గ విషయం అని అన్నారు. గ్రామానికి 1 నుండి 3 యూనిట్లు మాత్రమే కేటాయిస్తున్నట్లు వస్తున్న వార్తలు బాధాకరమైన విషయం అని అన్నారు. దాదాపు 9 సంవత్సరాల తరువాత అందిస్తున్న ఆర్థిక సహాయం కోసం చేతి వృత్తులు చేసుకునే మధ్య తరగతి వారు ముఖ్యంగా విశ్వకర్మలు (కమ్మరి, కంచరి, వడ్రంగి, శిల్పి, స్వర్ణకారులు) వేయి కళ్ళతో ఎదురు చేస్తున్నారని, కుల, అధాయ ధృవీకరణ పత్రాలకోసం అనేక వ్యయ ప్రయాసలకు ఓర్చి దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. కేవలం గ్రామానికి 2,3 యూనిట్లు కాకుండా 5 నుండి 10 యూనిట్లు ఇస్తే బాగుంటుందని అన్నారు. అదే విధంగా రెండు నుండి మూడు యూనిట్లు మాత్రమే కేటాయించడం వల్ల గ్రామీణ ప్రాంతాలలో దళారులు రంగంలో దిగి ఒక్కో యూనిట్‌కి 20 నుండి 50 శాతం డబ్బులు వసూలు చేసే ప్రయత్నాలు మొదలు పెట్టారని, అమాయక ప్రజలు మోసపోయే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం దళారీ వ్యవస్థను నిర్మూలించి పారదర్శకంగా ఆర్థిక సహాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సజ్జనం భాను ప్రసాద్, టటోజు అజయ్, పోతుగంటి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఆదివారం.. స్వచ్ఛ, సమైఖ్య కాలనీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీ స్వచ్ఛతకు, సమైక్యతకు ఆదర్శంగా ఉందని కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్ తెలిపారు. ఆర్మూర్ జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి కమిటీ ఆశ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమం నిర్వహించారు. కాలనీవాసులు శ్రమదానంతో రోడ్ నెంబర్ తొమ్మిదిలో పిచ్చి మొక్కలను, చెత్తాచెదారాన్ని తొలగించారు. మురుగు కాలువలలో నీటి ప్రవాహానికి అడ్డుగా నిలిచిన ప్లాస్టిక్ కాగితాలను చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ప్రతి ఒక్కరూ ఇళ్ళ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు గోసికొండ అశోక్ మాట్లాడుతూ తొమ్మిది వారాలుగా ప్రతి ఆదివారం రెండు గంటలు స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. హనుమాన్ ఆలయ కమిటి అధ్యక్షుడు పుప్పాల శివరాజ్ కుమార్ మాట్లాడుతూ కాలనీ అధ్యక్షుడు అశోక్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ కాలనీని ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతున్నారని అభినందించారు. కాలనీ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి బి.కమలాకర్, ఉపాధ్యక్షులు కొక్కెర భూమన్న సుంకె శ్రీనివాస్, కార్యదర్శులు కొంతం రాజు, లొచారం సాయన్న, ఘనపురం సంతోష్ ఎస్సారెస్పీ డీ ఈ గణేశ్ ఎల్‌టి కుమార్, ఎర్ర భూమయ్య, మంచిర్యాల కిషన్, శ్రీరాం రమణయ్య, బాలు, మారుతి, భాజన్న తదితరులు పాల్గొన్నారు.

బోధన్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.100 కోట్లు

- కృతజ్ఞతలు తెలిపిన ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ నియోజకవర్గం అభివృద్ధికి 100 కోట్లు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే ఎండీ. షకీల్ ఆమ్మేర్, ఎమ్మెల్సీ కవిత కు బోధన్ మండలం ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం బోధన్ మండలం పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీసీసీబి డైరెక్టర్ గిర్ధవర్.గంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయి, మాజీ మండల్ కోఆర్డినేటర్ బుద్దె రాజేశ్వర్ మాట్లాడుతూ.. బోధన్ నియోజకవర్గంలో కమ్యూనిటీ భవనాలకు, మురికి కాల్వలకు, సీసీరోడ్లకు, ఆర్అండ్‌బీ రోడ్లకు నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కోట. గంగారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ సాలూరా షకీల్, రైతు సమన్వయ సమితి మండల్ కోఆర్డినేటర్ వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సిర్ప.సుదర్శన్ ఎంపీటీసీ హన్మంతు, ఏఎంసీ డైరెక్టర్ వినోద్ నాయక్, బోధన్ మండల బీఆర్ఎస్ యువజన ఉపాధ్యక్షులు మేడి రవి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు కుర్మె రాజు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ - ముప్కాల్

ముప్కాల్ విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం సంఘ సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ నూతన అధ్యక్షులుగా అజోజి రాజేందర్, కోశాధికారిగా తాడూరి గంగాధర్, సలహాదారులుగా కస్తూరి రాజేశ్వర్, మాలెపు ఆనందం, వడ్లూరి నవీన్ చారి, తాడూరి గంగామహేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు అశోక్ చారి, ఓజా గంగాధర్, గంగాధర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ గొడుగులు పంపిణీ

నవతెలంగాణ-నందిపేట్



గొడుగులు పంపిణీ చేస్తున్న నాయకులు

కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరిం చుకుని ముందస్తుగా మండలంలోని లక్కంపల్లి గ్రామంలో గులాబి గొడుగులను మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్ ఆదివారం పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచంలోనే అత్యుత్తమ పారిశ్రామిక కేంద్రంగా రూపుదిద్దుతూ 24 గంటలు ప్రజల సంక్షేమ కోసం కేటీఆర్ పనిచేస్తున్నారన్నారు. సోమవారం మండలంలోని ప్రతి గ్రామంలో కేటీఆర్ పుట్టినరోజు సంబరాలు జరుపుకోవాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పియుసి చైర్మన్ జిల్లా అధ్యక్షులు ఆశన్నగారి జీవన్ రెడ్డి పిలుపునిచ్చారని సాగర్ తెలిపారు. కార్యక్రమంలో నందిపేట్ మండల భారత రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షులు మచ్చర్ల సాగర్, లక్కంపల్లి ప్రసాదరావు, ఉప సర్పంచ్ శ్రీనివాస్, సుదర్శన్, పవన్, గోపి, కడెన్న, ముత్యం, మంతెన శ్రీకాంత్, దర్వాడి అశోక్, రాకేష్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఎస్సైకి వీడ్కోలు

నవతెలంగాణ-బోధన్



బదిలీపై వెళ్తున్న ఎస్ఐని సన్మానించిన సిబ్బంది

బోధన్ రూరల్ ఎస్సైగా విధులు నిర్వహించి ఆదిలాబాద్ జిల్లాకు బదిలీపై వెళుతున్న లోకం సందీప్ కుమార్‌ను ఆదివారం బోధన్ రూరల్ పోలీసు, సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న ఎస్సై సందీప్ మాట్లాడుతూ విధి నిర్వహణలో తన వెన్నంటి ఉండి సహకరించిన పోలీస్ సిబ్బందికి, మండల ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏ ఎస్సై రవీందర్ , పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గోదావరిలో తగ్గిన నీటి ఉధృతి

- దోండలతో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రజలు

నవతెలంగాణ-రెంజల్

వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నీటి ఉధృతి పెరిగి గోదావరిలో జలకళతో సంతరించుకుంది. ఆదివారం నీటి ఉధృతి గణనీయంగా తగ్గిపోయింది. కందకుర్తి గోదావరి త్రివేణి సంగమంలో నున్న రాతి శివాలయం బయటపడింది. ప్రతి సంవత్సరంలా కొత్త నీరు రావడంతో మహారాష్ట్రలోని చించోలి గ్రామం మహిళలు కందకుర్తి గోదావరి ప్రధాన ఘాట్ల వద్ద 32 దోండలతో తెప్పలు విడిచి తమ మొక్కలను తీర్చుకున్నారు. అనంతరం తమ గ్రామదేవతలకు జలాభిషేకం చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. శ్రావణమాసంలో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు వారు తెలిపారు.